

ప్రభుత్వ ఆసుపత్రిలోనే నాణ్యమైన వైద్య సేవలు

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 20: ప్రభుత్వ ఆసుపత్రిలోనే నాణ్యమైన వైద్యసేవలు అందుతాయని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో అనుభవం ఉన్న వైద్యులు ఉంటారని, అందువల్ల మంచి సేవలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ స్రవంతి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, సూపర్‌వైజర్ రమ తదితరులున్నారు.

జడ్పీ మీటింగ్ గరం గరం!

రెవెన్యూ, తాగునీటి సమస్యలపై వాడీవేడిగా చర్చ

- ధరణి'ని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తాం
- అధికారులు తప్పు చేసినా ఊరుకునే ప్రసక్తి లేదు
- ప్రభుత్వ భూములు కాపాడుతాం, భూ కబ్జాలను ఉపేక్షించం
- జిల్లా పరిషత్ సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జనవరి 20 : ధరణి సమస్యలపై జడ్పీ సమావేశంలో సభ్యులు ధ్వజమెత్తారు. మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జడ్పీ సమావేశంలో రెవెన్యూ, తాగునీటి సమస్యపై వాడీవేడిగా చర్చ జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ఐటీ పరిశ్రమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరయ్యారు. కందుకూరు మండలం తిమ్మాపూర్‌లోని 147 సర్వే నెంబర్‌లో భూదాన్ భూములు అక్రమణ గురైన విషయం అధికారుల దృష్టికి తీసుకు వచ్చినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని కందుకూరు ఎంపీపీ ఆరోపించారు. రియల్ వ్యాపారులు భూదాన్ భూమి కొనుగోలు చేసి గుంటల్లో అమ్ముతున్నారని ఆమె ఆరోపించారు. బాచుపల్లి, నేదునూర్ భూదాన్ భూముల్లో కబ్జాలు జరుగుతున్నాయని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఆమె మంత్రిని కోరారు. దీంతో స్పందించిన మంత్రి ప్రభుత్వ భూములు కాజేయకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సీలింగ్ భూమిని పట్టాకింద మార్చారని, పట్టా భూమిని సీలింగ్ కింద మార్చారని జడ్పీటీసీ వెంకటేష్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పట్టా భూమిని సీలింగ్ కింద మార్చడంతో మనోవేదనకు గురైన ఓ నిరుపేద మహిళ ఉరి వేసుకుని చనిపోయినట్లు చెప్పారు. కడ్తాల రెవెన్యూ పరిధిలో భూ సమస్యలు అత్యధికంగా ఉన్నాయని సభ్యుడు మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. ఫార్మాసిటీ వచ్చింది కానీ.. భూమి సర్వే చేయకుండా సర్వే చేసినట్లు రికార్డుల్లో చేర్చారన్నారు. ధరణి కారణంగా ప్రస్తుతం కొందరు రైతులు అవసరాల కోసం అమ్ములేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రత్యేకంగా మీటింగ్ పెట్టి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ధరణిలో జరిగిన పొరపాట్లను అధిగమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ధరణికి సంబంధించి ప్రత్యేక పోర్టల్ తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా రెవెన్యూ అధికారులు, కలెక్టర్‌తో అతి త్వరలో సమీక్ష నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా.. ఎక్కడైనా తప్పిదాలు చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. అధికారుల పొరపాట్ల వల్ల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమైనా, భూ కబ్జాలకు పాల్పడినా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలో అక్రమ లే ఔట్లకు సంబంధించి చర్యలు తీసుకుంటామన్నారు. యాచారంలో మైనింగ్ జోన్ వద్దని చెప్పినా ఎవరూ వినలేరని ప్రస్తుతం బ్లాస్టింగ్ కారణంగా ఇండ్లు బీటలు వారుతున్నాయని, దుమ్ముతో పంటలు పాడవుతన్నాయని యాచారం ఎంపీపీ తెలిపారు. ఈ విషయాన్ని ఇప్పటి వరకు నాలుగేళ్లలో నలుగురు కలెక్టర్లు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఈ విషయంలో స్పందించిన మంత్రి పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులను అదేశించారు.

సమ్మర్ యాక్షన్ ప్లాన్ పకడ్బందీగా ఉండాలి..

సమ్మర్ యాక్షన్ ప్లాన్ పకడ్బందీగా ఉండాలని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. శాశ్వతంగా నీటి సమస్యను పరిష్కరించే విధంగా అధికారులు ఆలోచించాలన్నారు. వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని తెలిపారు. మిషన్ భగీరథలో ప్లానింగ్ దెబ్బదిన్నది.. డిమాండ్‌కు తగ్గట్టుగా నీటి సరఫరా లేదన్నారు. దూరం నుంచి లైన్ తీసుకువస్తున్నారని, అధికారులు ఇస్తున్న నివేదికల్లో తప్పు జరుగుతుందన్నారు. 2014 కంటే ముందు ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు, పైప్‌లైన్లను ఉపయోంచుకోవాలని తెలిపారు. ఎక్కడైనా నీటి సమస్య జఠిలంగా ఉంటే.. తన దృష్టికి తీసుకు రావాలని, అవసరమైన చోట ప్రత్యేక అనుమతితో బోర్ వేయిస్తానని తెలిపారు. జిల్లాలో టెక్నికల్ టీం రెడీ చేయాలని కలెక్టర్‌కు తెలిపారు. తాగునీటి సమస్యపై త్వరలోనే సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని చెప్పారు. రోడ్డు నిర్మాణంతో అబ్దుల్లాపూర్‌మెట్ జేఎన్‌ఆర్‌ఎం కాలనీలో 9 రోజులుగా నీరు రావడం లేదని, ఏఈకి చెప్పినా పట్టించుకోలేదని జడ్పీటీసీ సభ్యుడు దాస్ ఆరోపించారు. స్పందించిన మంత్రి రోడ్డు పనులు వెంటనే ఆపి కాలనీ వాసులకు తాగునీరందించాలని అధికారులను ఆదేశించారు. రేపు సాయంత్రంలోగా తనకు నివేదిక అందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. తండాల్లో తాగునీటి సమస్య నెలకొందని, పైప్‌లైన్లలో హెయిర్ లాక్ అవుతుందని దీంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తలకొండపల్లి ఎంపీపీ తెలిపారు. ఔటర్ రింగ్‌రోడ్డు వెలుపల ఉన్న ఇండ్లకు పైప్‌లైన్ వేసి భగీరథ నీటిని అందించాలని సభ్యులు కోరారు. ప్రత్యేకాధికారులకు చెక్‌పవర్ ఇవ్వాలని మహేశ్వరం ఎంపీపీ కోరారు.



మాట్లాడుతున్న శ్రీధర్‌బాబు, వేదికపై జడ్పీ చైర్‌పర్సన్ అనిత, కలెక్టర్ శశాంక్

ప్రజలు కోరిన విధంగా మార్పు..

మార్పు కోరిన ప్రజలకు మార్పు చూపించే బాధ్యత తమపై ఉందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మార్పు తీసుకు రావాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులను స్వీకరించామని తెలిపారు. ఇప్పటికే రెండు గ్యారంటీలను అమలు చేస్తున్నట్లు చెప్పారు.

టీచర్ల కొరత లేకుండా చూడాలి

పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. ఉపాధ్యాయల కొరత లేకుండా చేస్తామని, మార్చి 18 నుండి పదవ తరగతి పరీక్షలలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు రూపొందించామని డీఈవో సుశీందర్‌రావు తెలిపారు. అదేవిధంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రతి పేదవాడికి అన్ని రకాల వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డాక్టర్, సంబంధిత సిబ్బంది లేకపోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఖచ్చితంగా డాక్టర్ మరియు సంబంధిత సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను కోరారు. జిల్లా పంచాయతీ శాఖ, మైనింగ్ శాఖ,వ్యవసాయ శాఖ, సంక్షేమ శాఖ, విద్యుత్ శాఖ, వివిధ శాఖలకు సంబంధించి సమీక్షించారు. ఆయా శాఖలకు చెందిన జిల్లా అధికారులు జిల్లా పరిషత్ సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు తెలియజేశారు.



సమావేశానికి హాజరైన సభ్యులు

ఎమ్మెల్యేలు డుమ్మా..!

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి జడ్పీ సమావేశానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్ హాజరు కాగా.. ఇటీవలే కాంగ్రెస్‌లోకి చేరిన వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి భర్త, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సమావేశానికి హాజరయ్యారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, శేరిలింగపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో పాటు ఎంపీ రంజిత్‌రెడ్డి సమావేశానికి డుమ్మాకొట్టారు.



సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

రేపు లేదా ఎల్లుండి ఉచిత విద్యుత్ అమలు



రాష్ట్ర ఖజానాకు సంబంధించి ఇబ్బందులు ఉన్నప్పటికీ.. రేపులేదా ఎల్లుండి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తామని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. రూ.5 లక్షల వరకు పరిమితి ఉన్న ఆరోగ్యశ్రీ పథకాన్ని 10 లక్షల వరకు పెంచామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగులకు 5వ తేదీ వరకు వేతనాలు ఇస్తున్నామని చెప్పారు. తెలిపారు. స్థానిక సంస్థలకు ఇవ్వాల్సిన నిధులు ఇవ్వాలన్న దానిపై ఇటీవలే అసెంబ్లీలో సమీక్షించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ శశాంక, జడ్పీ ఈసీవో సీహెచ్ కృష్ణారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు

మహిళా సాధికారతకు ఉచిత బస్సు



సీఎం రేవంత్‌రెడ్డి మహిళా సాధికారత కోసం ప్రవేశ పెట్టిన ఉచిత బస్సు సౌకర్యం అభినందనీయమని జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనిత హరినాథ్ రెడ్డి అన్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు ఆర్థిక చేయూత లభిస్తుందన్నారు.

- జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనిత హరినాథ్‌రెడ్డి

మిషన్ భగీరథ అస్తవ్యస్తం



మిషన్ భగీరథ పథకం అస్తవ్యస్తంగా ఉందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. గ్రామాల్లోకి భగీరథ వాటర్ రావడం లేదన్నారు. కొత్తూరు మున్సిపాలిటీకి ఇప్పటి వరకు భగీరథ వాటరే రాలేదని చెప్పారు. వాటర్ లీకేజీ అయితే.. 10 గ్రామాల్లో నీటి సరఫరా నిలిచిపోతుందన్నారు. పైప్‌లైన్ తవ్వడు మూసుడుకే ఈ పథకం సరిపోతుందన్నారు. గురుకుల పాఠశాలకు కనెక్షన్ ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. తాను రూ.2 లక్షలు ఖర్చు పెట్టి గురుకులా పాఠశాలకు నీటిని అందించినట్లు చెప్పారు.

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి



వేసవిలో నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి తెలిపారు. భగీరథ నీటిపై అధికారుల వద్ద సరైన లెక్కలు లేవన్నారు. ప్రణాళికతో అధికారులు ముందుకు వెళితేనే వేసవిలో నీటి సమస్య రాకుండా చూడొచ్చని తెలిపారు. నీటి సమస్యపై ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి చర్చించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు.

- ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి

శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవాలయంలో

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- భక్తి శ్రద్ధలతో పూజలు, ధ్వజారోహణం
- భారీగా హాజరైన భక్తులు

కడ్తాల్, ఫిబ్రవరి 20: కడ్తాల మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవాలయంలో మంగళవారం బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏడు రోజుల పాటు కొనసాగే వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రధాన అర్చకులు వెంకటేశ్వరశర్మ, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్, టి. వేణుగోపాల్, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పాలాది ఆంజనేయులు ఈవో మోహన్‌రావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా తొలిరోజు అర్చకుల ఆధ్వర్యంలో స్వస్తి పుణ్యహావాచనం, విశ్వక్‌సేన పూజ, అఖండ దీపారాధన, ధ్వజారోహణం, అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారు జామున సుప్రభాత సేవతో స్వామివారికి మేలు కొలుపు పాడి అనంతరం ప్రత్యేక అలంకరణలతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. దేవాదాయ శాఖ అర్డీవో అనిత, ఈవో మోహన్‌రావులు హజరై పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కడారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ధ్వజారోహణంలో పాల్గొన్న భక్తులు

రూ.7లక్షల కోట్ల అప్పునకు

రూ.20వేల కోట్ల వడ్డీ భారం

- అర్హులందరికీ ఆరు గ్యారంటీల వర్తింపు
- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

చేవెళ్ల/మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 20: తొమ్మిదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రూ.7లక్షల కోట్ల అప్పులకు ఏటా రూ.20వేల కోట్ల వడ్డీ చెల్లించే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం మీద పడిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం మొయినాబాద్ మండలం ఎన్కెపల్లిలో కాంగ్రెస్ చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అర్హులందరికీ వర్తింపజేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 9సంవత్సరాల్లో పేదలకు రేషన్ కార్డులు ఎందుకు ఇవ్వలేదో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు గుంటనక్కల్లా సీటు కోసం చూస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు బీజేపీ, బీఆర్ఎస్‌లకు లేదన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలు కలిసి పోటీ చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ పాలకులు మతపర రాజకీయాలతో ఓట్లు దండుకునేందుకు చూస్తున్నారని ఆరోపించారు. ప్రతీ ఒక్కరి జన్‌ధన్ ఖాతాల్లో రూ.15లక్షలు వేస్తామని బీజేపీ పాలకులు ప్రజలను నమ్మించి మోసం చేశారన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిగా చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ బలమైన పార్టీగా మారిందని, కాంగ్రెస్‌ను ఢీకొనేందుకు బీజేపీ, బీఆర్ఎస్‌లు కుట్రలు పన్నుతున్నాయన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలిస్తామని ఒక్కటైనా ఇవ్వకుండా యువతను మోసం చేశారని విమర్శించారు. ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ పరం చేస్తున్నారని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజాపాలనకు మద్దతు తెలిపేందుకు కాంగ్రెస్ పార్టీలో చేరాలని బీఆర్ఎస్, బీజేపీ నాయకులకు మంత్రి పిలుపునిచ్చారు. సమావేశంలో రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల డీసీసీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, చేవెళ్ల అసెంబ్లీ కాంగ్రెస్ సమన్వయ కమిటీ చైర్మన్ చింపుల సత్యనారాయణరెడ్డి, నాయకులు పామెన భీంభరత్, పడాల వెంకటస్వామి, ఏనుగు జంగారెడ్డి, షాబాద్ దర్శన్, సులోచన, సదాలక్ష్మి, బండారు ఆగిరెడ్డి, చెక్కల ఎల్లయ్య, పట్నం రినీష్‌రెడ్డితదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

అరచేతిలో వైకుంఠం చూపి అధికారంలోకి..

- మాజీ మంత్రి హరీష్‌రావు

షాద్‌నగర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గ్యారంటీ పథకాల పేరుతో మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఇచ్చిన హామీలను మాత్రం నిలబెట్టుకోవడం లేదని సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు విమర్శించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని కుంట్ల రామిరెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు బ్యాంకు అప్పులు చెల్లించవద్దని, తాము అధికారంలోకి రాగానే రూ.2లక్షల రైతు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ నాయకులు రైతులను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారన్నారు. 3 నెలలు అవుతున్నా రుణమాఫీ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలో కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ఉద్యోగులు, ఎమ్మెల్యేలు, మంత్రుల జీతాలను బంద్‌పెట్టి రైతులకు రైతుబంధు ఇచ్చామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు కనీసం 3ఎకరాలు ఉన్న రైతులకు కూడా రైతుబంధు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వడానికి చేతులొస్తున్నాయి గానీ రైతులకు రైతుబంధు ఎందుకివ్వడం లేదని ఆయన ప్రశ్నించారు. వడ్లు పండించిన రైతులకు బోనస్ ఇవ్వకుంటే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఎండగట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కాగా లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవదని హరీష్‌రావు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎంపీలుగా బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిస్తేనే తెలంగాణ సమస్యలపై పోరాటం చేసే అవకాశం ఉంటుందన్నారు. మహబూబ్‌నగర్ లోక్‌సభా స్థానంలో మరోసారి బీఆర్ఎస్ జెండా ఎగరేసేందుకు కార్యకర్తలు నడుం బిగించాలని కోరారు. పాలమూరు-రంగారెడ్డి పనులు 80శాతం పూర్తయాయ్యని, ప్రాజెక్టు కింద కాలువలు తవ్వితే సాగునీరు అందుతుందన్నారు. ఈ పనిని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిచేయాలని సూచించారు. కాంగ్రెస్, టీడీపీ పాలనలో 2,07,300 ఎకరాలకు నీళ్లు ఇస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం 6.36లక్షల ఎకరాలకు సాగు నీరు ఇచ్చిందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు గురించి అడిగితే అసెంబ్లీలో తప్పుడు శ్వేత పత్రాలను ప్రవేశపెట్టి అసలు విషయాన్ని కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నించారన్నారు. సమావేశంలో మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ వాణీదేవి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, లక్ష్మారెడ్డి, రాజేందర్‌రెడ్డి, ఎ.వెంకటేశ్వర్ రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, కేశంపేట ఎంపీపీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న హరీష్‌రావు

అకృత్యాలను భరిస్తూ

ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు

రాచకొండ మహిళా భద్రతా విభాగం డీసీపీ ఉషా విశ్వనాథ్

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 20: ప్రేమ పేరుతో జరుగుతున్న అకృత్యాలను మౌనంగా భరిస్తూ ప్రాణాలమీదకు తెచ్చుకోవద్దని, విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పి సకాలంలో నిర్ణయాలు తీసుకోవాలని రాచకొండ మహిళా భద్రతా విభాగం డీసీపీ ఉషా విశ్వనాథ్ విద్యార్థినులకు సూచించారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ మహిళా భద్రతా విభాగం, గురునానక్ విద్యా సంస్థల ఎన్ఎస్ఎస్ విభాగాలు సంయుక్తంగా మంగళవారం ఇక్కడ కళాశాల క్యాంపస్‌లో ఆడపిల్లలు, మహిళలపై జరుగుతున్న సంఘ వ్యతిరేక కార్యకలాపాలపై ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడారు. టాక్సిక్ రిలేషన్స్ విషయంలో అమ్మాయిలు జాగ్రత్తగా ఉండాలన్నారు. కొందరు మగ పిల్లలు తమను ప్రేమించాలని.. లేదంటే వారితో చనువుగా ఉన్న ఫొటోలను వైరల్ చేస్తామని అమ్మాయిలను బ్లాక్ మెయిల్ చేసుంటారన్నారు. అలాంటప్పుడు తల్లిదండ్రులతో విషయాన్ని పంచుకుంటే తగు నిర్ణయాలు తీసుకునేందుకు అవకాశముంటుందన్నారు. అపరిచితులతో చాటింగ్ చేయడం, ఫోన్లో మాట్లాడడం చేయవద్దని అన్నారు. అమ్మాయిలు, మహిళలు ఏదైనా అపాయంలో లేదా అభద్రతా భావంతో ఉన్నా ధైర్యంగా సమస్యలను ఎదుర్కోవాలన్నారు. అవసరమైతే తల్లిదండ్రులు పోలీసుల సహాయం తీసుకోవాలన్నారు. పోలీస్‌స్టేషన్ వెళ్లనవసరం లేకుండానే షీ టీంకు ఫోన్‌చేస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచి తగు సహాయ సహకారాలు అందిస్తారన్నారు. ఆపదలో ఉన్న అమ్మాయిలు, మహిళలు ఏం చేస్తే దాని నుండి బయటపడతారనే విషయాన్ని ఏసీపీ జి.వెంకటేష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో గురునానక్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ జీఎస్ కోహ్లీ, ఎండీ హెచ్.ఎస్. సైనీ, డైరెక్టర్ కె.వెంకట్రావు, జాయింట్ డైరెక్టర్ పి.పార్థసారథి, ప్రిన్సిపాల్ డా.జి.శ్రీనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఉషా విశ్వనాథ్

జన జాతరకు వేళాయె..

నేటి నుంచి మేడారం కుంభమేళా ప్రారంభం

▸▸ నేడు గద్దెకు సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు ▸▸ నాలుగు రోజుల పాటు వనదేవతలకు పూజలు



సమ్మక్కగద్దె సారలమ్మగద్దె



వన దేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

వరంగల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడారం జనారణ్యం అవుతోంది. వనదేవతల ఆగమనానికి వేళవుతుండటంతో భక్తులతో మేడారం పోటెత్తుతోంది.ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అద్భుత క్షణాలు బుధవారం సాక్షాత్కరించనున్నాయి. తొలిరోజు సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెకు చేరుకుంటారు. ఎడ్లబండ్లు, కాలి నడకన, కార్లు, ఆటోలు, జీపులు, బస్సుల్లో భక్తులు మేడారం వస్తున్నారు.

నేటి నుంచి జాతర

తెలంగాణ కుంభమేళాగా పిలిచే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర బుధవారం నుంచి ప్రారంభం కానుంది. రెండేళ్లకోసారి మాఘ శుద్ధ పౌర్ణమిన రోజైన బుధవారం నుంచి శనివారం వరకు నాలుగు రోజుల పాటు ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని దట్టమైన అరణ్యంలోని మేడారంలో జరిగే ఈ మహాజాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. పూర్తిగా ఆది వాసీ సంప్రదాయ పద్ధతిలో జరిగే ఈ జాతరలో ప్రకృతే దైవంగా.. వనదేవతల స్మారకార్థం నిర్మించిన కర్రల వద్దే పూజలు నిర్వహిస్తారు. వనదేవతలకు పసుపు, కుంకుమ, ఒడి బియ్యం, ఎదుర్కోళ్లతో పాటు బంగారాన్ని (బెల్లం) మొక్కుగా చెల్లిస్తారు.

గద్దెపైకి చేరిన జంపన్న

జాతర నేపథ్యంలో సమ్మక్క తనయుడు జంపన్న కన్నెపల్లి నుంచి మంగళవారం రాత్రి 8గంటలకు జంపన్న వాగు ఒడ్డునున్న గద్దెకు చేరుకున్నారు. పోలెబోయిన వంశీయులు పూజారి సత్యం ఆధ్వర్యంలో పగిడె రూపంలో ఉన్న జంపన్నను గద్దెపై కొలువుదీర్చి పూజలు చేశారు.

నేడు గద్దెకు చేరనున్న సారలమ్మ

జాతర తొలిరోజున కన్నెపల్లి ఆడపడుచు సారలమ్మ గద్దెపైకి రానుంది. సారలమ్మ కొలు వైన పల్లె కన్నెపల్లిలో బుధవారం ఉదయమే ప్రధాన పూజారి కాక సారయ్య ప్రత్యేక పూజ లు నిర్వహిస్తారు. సారయ్యతోపాటు మిగతా పూజారులు ఆలయాన్ని శుద్ధి చేసి అలికి ము గ్గులతో అలంకరిస్తారు. సాయంత్రం ఆలయం లో ఆదివాసీ పూజారులు రహస్య పూజలు జ రుపుతారు. ఈ సమయంలోనే పూజారి సార య్యను సారలమ్మ ఆవహిస్తుంది. సారయ్యకు పూనకం రావడంతో ఆలయం నుంచి గద్దెల వైపు పూజారులు సారలమ్మను తీసుకవ స్తారు. కన్నెపల్లి మీదుగా తన తమ్ముడు జంపన్నను పలకరిస్తూ జంపన్నవాగును పూజారులు దాటుతారు. ఈ సమయంలోనే శివసత్తుల పూనకాలతో భక్తుల పుణ్యస్నానాలతో జంపన్నవాగు పులకరిస్తుంది. కన్నెపల్లి నుంచి మేడారంలో ఉన్న సమ్మక్క ఆలయానికి సారలమ్మ చేరుకుంటుంది.

పగిడిద్దరాజు, గోవిందరాజుల రాక

మంగళవారం మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి సమ్మక్క భర్త పగిడిద్దరాజు మేడారం బయలు దేరారు. ఆదివాసీలు కాలినడకన పగిడిద్దరాజును పడిగె రూపంలో తీసుకుని బుధవారం సాయంత్రానికి మేడారంలోని సమ్మక్క గుడికి చేరుకుంటారు. ఇక పగిడిద్దరాజు తమ్ముడు గోవిందరాజులు కూడా బుధవారమే ఏటూరునాగారం మండలం కొండాయి నుంచి బయలుదేరి, మేడారం చేరుకుంటారు. సమ్మక్క ఆలయంలో ముగ్గురికి పూజలు చేస్తారు. అనంతరం రాత్రి 8గంటలకల్లా మేడారంలోని గద్దెలపైకి చేరుకుంటారు. తొలిరోజు జాతర అట్టహాసంగా ప్రారంభం అవుతుంది.



కన్నెపల్లి నుంచి జంపన్నను గద్దెపైకి తీసుకొచ్చి ప్రతిష్ఠిస్తున్న వడ్డెలు



మేడారం జాతరకు తరలివస్తున్న భక్తులు

22న సమ్మక్క ఆగమనం

జాతరలో రెండోరోజైన గురువారం 22న మేడారంలోని చిలుకలగుట్టపై రహస్య ప్రాంతంలో సమ్మక్క ప్రధాన పూజారి కొక్కెర కిష్టయ్యతో పాటు వడ్డెలు మునిందర్, బొక్కయ్య ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం కుంకుమ భరణి రూపంలో ఉన్న సమ్మక్కను తీసుకుని ప్రధాన పూజారి కిష్టయ్య చిలుకలగుట్టపై నుంచి కిందకు వస్తున్న క్రమంలో ములుగు ఎస్పీ గాలిలోకి కాల్పులు జరిపి సమ్మక్క రాకను స్వాగతిస్తారు. ఆ సమయంలో కోట్లాది భక్తుల జయజయ నినాదాలతో మేడారం హోరెత్తుతుంది. సమ్మక్క ఆగమనంతో దారి పొడవునా వేలాది మేకలు, గొర్రెలు, కోళ్ల తలలు తెగి రక్తం చిందిస్తాయి. పూజారులు అత్యంత భక్తిశ్రద్ధలతో రాత్రి 10గంటల కల్లా సమ్మక్క గద్దెకు చేరుకోవటంతో మహాజాతర తుది ఘట్టానికి చేరుకుంటుంది.


23న మొక్కులు

జాతర మూడోరోజు శుక్రవారం గద్దెలపై సమ్మక్క, సారలమ్మల, పగిడిద్దరాజు, గోవిందరాజులు చేరుకోవటంతో భక్తులు రాత్రింబవళ్లు మొక్కులు చెల్లించేందుకు బారులు తీరుతారు. 23వ తేదీ శుక్రవారం వనదేవతలకు మొక్కులు చెల్లింపులు చేస్తారు. తీరొక్క మొక్కులతో వనదేవతలను శరణ కోరుతారు.

24న వనప్రవేశం

జాతరలో చివరి రోజైన నాలుగో రోజు శనివారం సాయంత్రం 6గంటలకు సమ్మక్క తిరిగి చిలుకలగుట్టకు తిరుగు ప్రయాణం అవుతుంది. సమ్మక్క వనప్రవేశంతో సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు కూడా వారి స్వగ్రామాలకు పయనం అవుతారు. దీంతో జాతర ముగుస్తుంది.







మహేశ్వరం మెట్లబావి పనులు త్వరగా పూర్తి చేయాలి



కోనేరు పునరుద్ధరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం, ఫిబ్రవరి 20: మహేశ్వరంలోని కాకతీయుల కాలంనాటి కోనేరు(మెట్లబావి) పుణరుద్ధరణ పనులను త్వరగా పూర్తిచేయాలని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. రూ.90లక్షలతో చేపడుతున్న కోనేరు పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోనేరు పనుల్లో ఆలస్యం జరగకుండా చూడాలని, అందుకు ఎలాంటి సాయసహకారాలు కావాలన్నా ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. చారిత్రక కోనేరు శిథిలావస్థలో ఉండగా గత ప్రభుత్వం ఆలయాల పునరుద్ధరణకు కోట్లాది నిధులు కేటాయించిందన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో రూ.10కోట్లకుపైగా వెచ్చించి పురాతన ఆలయాల పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నామన్నారు. చారిత్రక శివగంగ రాజరాజేశ్వరాలయ అభివృద్ధికి కూడా నిధులు కేటాయించామని గుర్తుచేశారు. అలాగే తెలంగాణ అమరవీరుడు సిరిపురం యాదయ్య వర్ధంతిని పురస్కరించుకొని మహేశ్వరం గేటు వద్ద ఉన్న యాదయ్య విగ్రహానికి నివాళ్లు అర్పించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ నాయకులు కె.చంద్రయ్య, ఎం.నవీన్, మల్లేష్, అంబయ్య, నందం, రవినాయక్, రాజు, జె.లక్ష్మయ్య, సామేల్‌రాజు, నప్పిడి రాజు, సుమన్, రామకృష్ణ, డి.అశోక్, సమీర్, అదిల్ అలీ, కె.ప్రభాకర్, హరికృష్ణారెడ్డి పాల్గొన్నారు.



సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో

వైభవంగా సమతా కుంభ్ ప్రారంభం

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- భక్తులకు మంగళాశాసనాలు అందజేసిన చిన జీయర్‌స్వామి
- వచ్చే నెల 1వ తేదీ వరకు బ్రహ్మోత్సవాల నిర్వహణ



సువర్ణ భగవత్ రామానుజ స్వామికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 20: రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధి ముచ్చింతల్‌లో గల సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో సమతాకుంభ్2024 ద్వితీయ బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆధ్యాత్మిక గురువు త్రిదండి రామానుజ చిన జీయర్‌స్వామి పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉదయం అర్ఘాభిషేకం ఘనంగా జరిగింది. సువర్ణమూర్తి భగవత్ రామానుజస్వామికి ఉత్సవారంభ స్నపనం నిర్వహించారు. అర్ధ అనేది రామానుజుల అవతార నక్షత్రం అని, ఈ క్షేత్రానికి అధిష్ఠాన దేవుడు శ్రీరామచంద్రుడని, ప్రతీ అర్ధ నక్షత్రం నుంచి చిత్త నక్షత్రం వరకు ఈ బ్రహోత్సవాలు నిర్వహిస్తామని చినజీయర్ స్వామి తెలిపారు. కాగా 108 దివ్య దేశాల భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన జీయర్‌స్వామి భక్తులనుద్దేశించి మాట్లాడారు. అయోధ్య రాముడు మాత్రం పుర్వసు నక్షత్రంలో జన్మించాడన్నారు. తిరు నక్షత్ర ప్రయుక్త తిరుమంజనంతో శుభారంభం జరుగుతోందని ఆయన తెలిపారు. శ్రీ రామానుజుల వారికి అలంకరణ చేసి అష్టోత్తర శతనామ అర్చన జరిపించామన్నారు. మొదటి రోజు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. నగరంతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి, ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రల భక్తులు వేలాదిగా వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. చివరగా భక్తులకు చిన జీయర్‌స్వామి మంగళా శాసనాలు అందజేశారు. మరో వారం పాటు జరిగే బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఈ సందర్భంగా స్వామిజీ తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటారని స్వామిజీ తెలిపారు. కార్యక్రమంలో అహోబిల జీయర్‌స్వామి, దేవనాథ జీయర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.



చిన జీయర్‌స్వామిని ఆశీర్వదిస్తున్న వేద పండితులు

ఆలయాల భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు



ఆలయ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయిస్తున్న అనిత

కడ్తాల్, ఫిబ్రవరి 20: ఆలయాల భూములను ఆక్రమించినా, అక్రమ నిర్మాణాలు చేపట్టినా కఠిన చర్యలు తప్పవని ఆలయ భూముల పరిరక్షణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ అనిత హెచ్చరించారు. జిల్లాలో ఆలయ భూముల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కడ్తాల పంచాయతీ పరిధి లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ భూములు అన్యాక్రాంతంపై మంగళవారం సర్వే నిర్వహించారు. భూములను ఎండోమెంట్ ఈవోలు మోహన్‌రావు, స్నేహలత, దేవాదాయ తహసీల్దార్లు హారిక, విజయలక్ష్మి పరిశీలించారు. సర్వే నంబర్ 125,130లలో సర్వే చేసి ఆలయ కమిటీ చైర్మన్ అంజనేయులుతో కలిసి హద్దులు నిర్ధారించారు. సర్వే నంబర్ 120లో గల ఆలయ భూమి మరో రెండు రోజుల్లో సర్వే చేస్తామని అధికారులు తెలిపారు. సర్వే నంబర్ 125లోని 9.13ఎకరాలు, 130లోని 2.20ఎకరాలకు హద్దులు పాతించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఆలయ భూముల నుంచి కొందరు ఏర్పాటు చేసుకున్న రోడ్డును ధ్వంసం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ టి.వేణుగోపాల్, నాయకులు వెంకటేశ్, గూడూరు సాయిరెడ్డి, మల్లేశ్‌గౌడ్, యాదయ్యగౌడ్, బిక్యా, రాఘవేందర్ ఉన్నారు.

సైబర్ నేరగాళ్లతో రైతులు జాగ్రత్త

- ఓటీపీ ఎవరికీ చెప్పొద్దు : షాబాద్ ఇన్‌స్పెక్టర్ యాదయ్యగౌడ్

షాబాద్, ఫిబ్రవరి 20 : పంట పండించిన రైతులకు సైబర్ నేరగాళ్ల ముప్పు పొంచి ఉందని షాబాద్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ యాదయ్యగౌడ్ అన్నారు. వారిపట్ల రైతులు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. రైతుల బ్యాంకు ఖాతాల్లో పడే పంట డబ్బులను ఓటీపీ ద్వారా మాయం చేస్తూ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. రైతుల ఖాతాల్లో డబ్బు ఉన్న విషయం తెలుసుకొని ఫోన్‌చేసి ఓటీపీ అడుగుతూ ఖాతాల్లోని డబ్బును ఖాళీ చేస్తున్నారని తెలిపారు. 'మీకు వ్యవసాయ శాఖ లోన్ వచ్చిందని, గొర్రెలు, మేకలు, ఇతర పశువుల సబ్సిడీకి వివరాలు కావాలని, మీ సిమ్‌కార్డు బ్లాక్ అయిందని.. ఇలా వివిధ సాకులు చెబుతూ ఓటీపీ అడుగుతారని.. ఇలాంటి ఫోన్ కాల్స్‌ను ఎవరూ నమ్మొద్దని అధికారి చెప్పారు. బ్యాంకులే కాదు ఏ ప్రభుత్వ అధికారి, లేదా ప్రైవేట్ కంపెనీలైనా ఓటీపీ(వన్ టైమ్ పాస్‌వర్డ్) అడగవని పేర్కొన్నారు. ఒక వేళ అలా అడిగారంటే అది మోసం చేసేందుకే అని ప్రజలు ముఖ్యంగా రైతులు గుర్తుంచుకోవాలని తెలిపారు. ఓటీపీ అనేది సీక్రెట్ అని ఆ నంబర్‌ను ఎవరికీ చెప్పొద్దని తెలిపారు. మన ప్రయత్నం లేకుండా వచ్చే ఓటీపీలకు స్పందించకూడదని, ఇలాంటి నేరాలు ఎక్కువగా బ్యాంకుల సెలవు రోజుల్లో జరుగుతాయని తెలిపారు. ఒకవేళ ఫోన్‌కాల్స్‌తో మోసపోయిన వారు వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఈ సందర్భగా ఆయన సూచించారు.



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్

ఇన్‌స్పెక్టర్ సూచించిన అంశాలవీ...

- మీకు లాటరీ వచ్చింది. బహుమతి వచ్చింది. మీ బ్యాంకు అకౌంట్ డబ్బులు వేస్తామంటూ బ్యాంకు వివరాలు అడిగినప్పుడు చెప్పకూడదు.
- మెసేజ్‌లలో ఉండే నీలిరంగు లింక్‌లను క్లిక్ చేయవద్దు
- వివిధ వెబ్‌సైట్లు, సంస్థల నుంచి కస్టమర్ కేర్ వారు చెప్పినట్లు చేయవద్దు. నిజమైన కంపెనీలు ఇలా ఏవీ ఫోన్లో అడగవు.
- తక్కువ వడ్డీకి లోన్ ఇస్తామంటే నమ్మొద్దు. అలాంటి వాటికి ఎలాంటి చెల్లింపులు చేయవద్దు.
- బహుమతి వచ్చిందంటూ మెసేజ్ వస్తే నమ్మొద్దు. వారి చెప్పినట్టుగా ఎలాంటి చెల్లింపులు చేయవద్దు. ఇవన్నీ మోసమే!

నాటకీయ పరిణామాల మధ్య జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ అరెస్ట్

నందిగామ, ఫిబ్రవరి 20 : భూ లావాదేవీల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ నాగర్ కుంట నవీన్‌రెడ్డిని సోమవారం తెల్లవారుజామున నందిగామ పోలీసులు ఆయన స్వగ్రామం నందిగామ మండలం మొదళ్లగూడలో అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు... ఇదే గ్రామానికి చెందిన కొందరు ఇటీవల భూ వివాదాలపై సైబరాబాద్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. నవీన్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు మొదట సైబరాబాద్ కమిషనరేట్‌కు తరలించి అక్కడి నుంచి శంషాబాద్ డీసీపీ కార్యాలయానికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి నవీన్‌రెడ్డిని షాద్‌నగర్ కోర్టులో హాజరుపరిచారు. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ఉండేందుకు న్యాయాధికారి ఆదేశాల మేరకు నవీన్‌రెడ్డిని షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కోర్టు ఆవరణలో నవీన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తనను ఏ కేసులో అరెస్ట్ చేశారో తెలియదని, గతంలో తనపై భూ వివాద కేసులు పెట్టినా ఆధారాల్లేవని ఏసీపీ పరిధిలోనే కేసును కొట్టేశారని తెలిపారు. కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు తనపై కక్షపూరితంగా కేసులు పెట్టించి అరెస్ట్ చేయించారని ఆరోపించారు. మంగళవారం రాత్రి 8గంటల వరకూ కోర్టులో బెయిల్ పై తేలలేదు. నవీన్‌రెడ్డిని కోర్టులో హాజరుపర్చినట్టు తెలుసుకున్న మండలానికి చెందిన కొందరు బీఆర్‌ఎస్ కార్యకర్తలు, కేశంపేట ఎంపీపీ రవీందర్ అక్కడికి చేరుకొని నవీన్‌రెడ్డికి అనుకూలంగా నినాదాలు చేశారు.


మొండిగౌరెల్లిలో ప్రభుత్వ భూమి పరిశీలన

యాచారం, ఫిబ్రవరి 20: మండలంలోని మొండిగౌరెల్లిలో సర్వే నంబర్ 19, 68లలో గల ప్రభుత్వ భూములను మంగళవారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఈ సర్వే నంబర్లలో ఐదు వందల ఎకరాల వరకు ఉన్న ప్రభుత్వ భూములను గతంలో చెంచల్‌గూడ జైలును ఇక్కడికి తరలించేందుకు గాను కేటాయించారు. కొన్ని కారణాలతో ఆ ప్రయత్నం ఆగిపోయింది. అవే భూములను ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, ఎమ్మార్వో అయ్యప్ప పరిశీలించారు. ఇక్కడ డ్రోన్‌పోర్ట్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని ఆర్డీవో పేర్కొన్నారు. టీఎస్ఐఐసీ సూచనల మేరకు అధికారులు భూములు పరిశీలించినట్లు తెలుస్తుంది. భవిష్యత్తులో ప్రభుత్వం చేపట్టబోయే ప్రాజెక్టుకు సంబంధించి భూమి లభ్యత కోసమే భూములు అధికారులు పరిశీలించినట్లు తెలుస్తోంది.



మొండిగౌరెల్లిలో భూముల పరిశీలిస్తున్న అధికారులు

బీఆర్ఎస్ నిరంకుశ పాలనలో తెలంగాణ ఆగమైంది



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట, ఫిబ్రవరి 20: గత బీఆర్ఎస్ నిరంకుశ పాలనలో యావత్ తెలంగాణ ఆగమైందని, కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రజలు సంతోషంగా ఉంటున్నారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధి ఎక్లాస్‌ఖాన్‌పేటలో సీసీ రోడ్డు, తులవానిగడ్డలో ఎమ్మెల్యే సొంత డబ్బులతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ప్రారంభం, డ్వాక్రా భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే మండల పరిషత్‌లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అంతకుముందు తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలర్పించిన సిరిపురం యాదయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో అర్హులకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కాంగ్రెస్ మహిళలకు అండగా ఉంటుందని తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలిచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణాలు యుద్ధ ప్రాతిపదికన చేస్తామ న్నారు. 91 కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ టి.విశాలశ్రవణ్‌రెడ్డి,తహసీల్దార్ ఆజం అలీ, ఎంపీటీసీలు సురేష్‌రెడ్డి, మంజుల, ఏఎంసీ మాజీ చైర్మన్ వై.యాదయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేష్, నాయకులు యెన్నం శ్రీధర్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, సందరయ్య, అనుమగళ్ల రమేష్, భాస్కర్‌గౌడ్, ఇబ్రహీం, రావుల వెంటయ్య, రూప్లా నాయక్, యాదగిరిచారి, వెంకటేష్‌గౌడ్, రాఘవేందర్‌రావు, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ ప్లాట్ ఆక్రమణను అడ్డుకోండి



పోచమ్మ గడ్డ తండాలో పంచాయతీ ప్లాట్‌లో నిర్మిస్తున్న ప్రహరీ

కందుకూరు, ఫిబ్రవరి 20: సార్లరావులపల్లి పంచాయతీ అనుబంధ గ్రామం పోచమ్మగడ్డ తండాలో పంచాయతీ ప్లాట్‌ను రవి అనే వ్యక్తి ఆక్రమిస్తున్నాడని, ఆక్రమణను అడ్డుకోవాలని తండావాసులు వి.సత్యవతి, మరి కొందరు మంగళవారం ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. 10 సంవత్సరాల క్రితం ముచ్చర్లలోని 26/ఈ సర్వేనంబరులో మాజీ సర్పంచ్ వి.గోవర్ధన్‌నాయక్ తన పట్టా భూమిలో 150గజాల స్థలాన్ని పంచాయతీకి రాసిచ్చారు. ఈ స్థలంలో మంచినీటి బోరు, చేతి పంపు, ట్రాన్స్‌ఫార్మ ర్‌ను ఏర్పాటు చేశారన్నారు. వారం రోజులుగా తండావాసి ఎస్.రవి ఈ స్థలాన్ని ఆక్రమిస్తూ ఇంటి నిర్మాణం చేపట్టాడన్నారు. అధికారులు వెంటనే స్పందించి పంచాయతీ స్థలాన్ని కాపాడాలని వారు కోరారు.

ఘనంగా సిరిపురం యాదయ్య వర్ధంతి



యాదయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 20 : తెలంగాణ అమరవీరుడు సిరిపురం యాదయ్య వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో మంగళవారం ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై అమరవీరుల స్థూపం వద్ద యాదయ్య చిత్రపటానికి పూల మాలలువేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాములు, బీఆర్ఎస్వీ రాజ్‌కుమార్, అరవింద్, రవికుమార్, మహేష్, జగన్ పాల్గొన్నారు.

ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రణాళిక



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మెకానిక్ బాబ

ఆమనగల్లు, ఫిబ్రవరి 20 : ఆమనగల్లు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి ఆదర్శంగా నిలుపుతామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి పెద్ద పీట వేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ 9వ వార్డు పోస్టాఫీస్ కాలనీ, శ్రీకాంత్ కాలనీ, 8వ వార్డు బీసీ కాలనీ, 12వ వార్డు శాంతినగర్ కాలనీల్లో సీసీ రోడ్లు, అంతగర్గత మురుగు కాల్వల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని, అందుకు నిధులు మంజూరు చేయించాలని ఆయా వార్డు నాయకులతో కలిసి కేఎన్ఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షుడు మెకానిక్‌బాబ మంగళవారం ఎమ్మెల్యేను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి ఎమ్మెల్యే అధికారులతో సమావేశమయ్యారు. ఈజీఎస్ ద్వారా చేపట్టే సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధి ప్రజలకు మౌలిక వసతులు కల్పించి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. నియోజకవర్గంలోని కల్వకుర్తి, ఆమనగల్లు మున్సిపాలిటీల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఆమనగల్లు జూనియర్ కళాశాల అసంపూర్తి పనులు పూర్తిచేయించి 2024-25 విద్యా సంవత్సరానికి వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు నారాయణరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా వార్డుల నాయకులు సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

గట్టిప్పలపల్లి పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం

తలకొండపల్లి, ఫిబ్రవరి 20: మండల పరిధి గట్టిప్పలపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులు మంగళవారం స్వయంపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. విద్యార్థిని, విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణతో తోటి విద్యార్థులకు బోధించారు. స్వయం పాలనలో భాగంగా డీఈవోగా వసంత్, డిప్యూటీ ఈవోగా శశాంత్, ఎంఈవోగా మమత, హెచ్ఎంగా ప్రణీత, మరో 20మంది టీచర్లుగా వ్యవహరించారు. సాయంత్రం హెచ్ఎం కృష్ణయ్య అధ్యక్షతన జముగింపు సమావేశం నిర్వహించారు. బోధనలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ఇచ్చారు. కార్యక్రమంలో టీచర్లు శ్రీధర్, రాములయ్య, లక్ష్మణ్, శ్రీనివాస్, సునీత, వెంకటేశ్వరమ్మ, కృష్ణ, ప్రేమయ్య, అనురాధ తదితరులు పాల్గొన్నారు.



స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులతో స్కూల్ టీచర్లు

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం



కమిషనర్ వసంతను సన్మానిస్తున్న విద్యానగర్ కాలనీ నాయకులు

ఆమనగల్లు, ఫిబ్రవరి 20: ఆమనగల్లు మునిసిపాలిటీ నూతన కమిషనర్ వసంతను విద్యానగర్ సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కాలనీ అధ్యక్షుడు పాషా ఆధ్వర్యంలో నాయకులు కార్యాలయంలో కమిషనర్‌ను శాలువాలతో సత్కరించారు. విద్యానగర్ కాలనీలో నెలకొన్న సమస్యలపై వివరించి పరిష్కరించాలని కోరారు. కాలనీలో సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాల్వలు, తాగునీరు, విద్యుత్ దీపాలు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను కోరగా సానుకూలంగా స్పందించారని పాషా తెలిపారు. కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షుడు శేఖర్, కోశాధికారి సుదర్శన్‌రెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే కమిషనర్‌ను కౌన్సిలర్ చెన్నకేశవులు సత్కరించారు. చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్‌చైర్మన్ దుర్గయ్య, బీజేపీ నాయ కుడు శ్రీను ఉన్నారు. వసంతను మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, నాయకులు రవి, మహేశ్, గోపి, నర్సింహ, రాములు, శ్రీను, ప్రసాద్, సురేశ్, భారతమ్మ సత్కరించారు.

బీజేపీ విజయ సంకల్పయాత్రను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గసభ్యుడు బస్వ పాపయ్యగౌడ్

మహేశ్వరం, ఫిబ్రవరి 20: తెలంగాణ రాష్ట్ర బీజేపీ తలపెట్టిన విజయ సంకల్ప యాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్యగౌడ్ అన్నారు. మంగళవారం బీజేపీ మండల అధ్యక్షుడు మాధవాచారి అధ్యక్షతన మన్సాన్‌పల్లి చౌరస్తాలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పాపయ్యగౌడ్ మాట్లాడుతూ విజయ సంకల్ప యాత్ర ఈ నెల 22న మహేశ్వరం మండలంలోకి ప్రవేశిస్తుందని, అదే రోజు సాయంత్ర మహేశ్వరంలో ఐదు వేలకుపైగా జన సమీకరణతో బహిరంగ సభ ఉంటుందన్నారు. బీజేపీ జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ నాయియకులతో పాటు శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, బూత్ అధ్యక్షులు నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని పిలుపునిచ్చారు. నాయకులు జంగయ్య, సుదర్శన్‌రెడ్డి, అనంతయ్య గౌడ్, యాదయ్యగౌడ్, యాదీష్, మంత్రిముత్యం, పంతునాయక్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడి మృతి



మొగిలిగిద్ద పాండు రంగారావు(ఫైల్)

షాబాద్, ఫిబ్రవరి 20: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మొగిలిగిద్ద పాండురంగారావు (60) అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం మృతిచెందారు. మన్‌మర్రికి చెందిన పాండురంగారావు కొన్ని రోజులుగా అనారోగ్యంతో నగరంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి, ఎంపీపీ ప్రశాంతిమహేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సంతాపం తెలిపారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను వెంటనే చెల్లించాలి



చేవెళ్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏబీవీపీ నాయకులు, విద్యార్థుల ధర్నా

చేవెళ్ల/శంషాబాద్/ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 20 : ప్రభుత్వాలు మారినా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు ఇవ్వడం లేదని ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ కళ్లెం సూర్యప్రకాశ్ అన్నారు. మంగళవారం చేవెళ్లలో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అధికారులకు వినతిప్రతం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఏళ్లుగా విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వక పేద విద్యార్థుల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో రూ.5,300కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం బిల్లులు విడుదల చేయకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి మహిపాల్, హరికృష్ణ, శివ, తరుణ్, శివ, ప్రదీప్, శ్రీనాథ్, పావని, శ్రావ్య, కల్యాణి, కీర్తణ, కావ్య, శిరీషవిద్యార్థులు పాల్గొన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ విద్యార్థులు శంషాబాద్‌లోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. జిల్లా కన్వీనర్ సి.మహేశ్ మాట్లాడుతూ విద్యార్థుల పోరాటాలతో ఏర్పడ్డ తెలంగాణలోనూ ప్రభుత్వాలు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందని ద్రాక్షలా మారాయన్నారు. విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ మణికంఠ, శివ, పవన్, నవీన్, తిరుపతి, రాథోడ్ తదితరులు పాల్గొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు ఇబ్రహీంపట్నం తహసీల్దార్ అనితకు వినతిపత్రం ఇచ్చారు. గత ప్రభుత్వం ఈ విషయంలో నిర్లక్ష్యం చేసిందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఎం.సాయిచరణ్ అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అయినా సానుకూలంగా స్పందించి వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు జగదీష్, సాయికిరణ్, మహేందర్, పవన్ విద్యార్థులు పాల్గొన్నారు.



శంషాబాద్‌లో ధర్నా చేస్తున్న నాయకులు, విద్యార్థులు



ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

టెన్త్ విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్‌ల పంపిణీ



ఎగ్జామ్ ప్యాడ్‌లను అందజేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

కేశంపేట, ఫిబ్రవరి 20: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు ఎన్ఎస్‌యూఐ అధ్వర్యంలో మంగళవారం ఎగ్జామ్ ప్యాడ్‌లను పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకుడు వంశీచంద్‌రెడ్డి సూచన మేరకు విద్యార్థులకు ప్యాడ్‌లను అందజేస్తున్నామని యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్, ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శి అనుదీప్ తెలిపారు. మండలంలో 350మంది విద్యార్థులకు ప్యాడ్‌లను అందించామని వివరించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ వై.యాదయ్యయాదవ్ చేతుల మీదుగా కేశంపేట హైస్కూల్ విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్‌లను అందించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గిరిధర్‌యాదవ్, లింగం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు



ఉత్సవాల్లో పాల్గొన్న తహసీల్దార్ ప్రసాద్‌రావు, ఎంపీపీ నర్మద

మంచాల, ఫిబ్రవరి 20:సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలు మండల పరిధిలో మంగళవారం ఘనంగా జరిగాయి. లోయపల్లిలో నిర్వహించిన ఉత్సవాల్లో తహసీల్దార్ ప్రసాద్‌రావు, ఎంపీపీ జాటోత్ నర్మద, రాష్ట్ర బంజారా సంఘం ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్‌నాయక్, ఎంపీవో తేజ్‌సింగ్ పాల్గొని గిరిజనులనుద్దేశించి ప్రసంగించారు. బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేసిన మహనీయుడు సేవాలాల్ అని అన్నారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన నాయకులు శ్రీనునాయక్, బాలూ, ఎంపీటీసీ రాందాస్, శ్రీధర్, నాని, లచ్చిరాం, బాలాజీ, మోతీరాం పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కందుకూరు, ఫిబ్రవరి 20: గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ గంగాపురం చెన్నకిషన్‌రెడ్డి కోరారు. మంగళవారం మండల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి, కార్యదర్శి కుంచకరూరి వెంకటేశ్వర్లుగుప్తా తిమ్మాపురంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నాలుగు వందల మందికి వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. అందులో 34మందికి కళ్లద్దాలు ఇచ్చారు. 16 మందిని క్యాటరాక్ట్ ఆపరేషన్ కోసం కడ్తాల్‌లోని కంటి ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా వైస్‌గవర్నర్ మహేంద్రకుమార్‌రెడ్డి, రీజినల్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి రమన్‌బాబు, కందుకూరు లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు అంజయ్య, రాంరెడ్డి, అమరేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, బిక్షపతి, నాయకులు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, సురేందర్ రెడ్డి, తిరుమల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి లచ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలి



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను సన్మానిస్తున్న కేబీ దొడ్డి గ్రామస్తులు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 20 : మండల పరిధిలోని సుల్తాన్‌పల్లి అనుబంధ గ్రామమైన కేబీ దొడ్డి వాసులు మంగళవారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను కలిసి గ్రామాభివృద్ధి నిధులు కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. మాజీ సర్పంచ్ దండు ఇస్తారి అధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల కోసం రూ.15లక్షలు కేటాయించాలని కోరారు. అయితే గ్రామస్తుల కోరిక మేరకు నిధులు కేటాయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని చెప్పారు. నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యేను గ్రామస్తులు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దిద్యాల జయమ్మశ్రీనివాస్, గ్రామస్తులు మల్లికార్జున్, ససీరుద్దీన్, చంద్రశేఖర్, గోపాల్, కుమార్, నవీన్, యాదయ్య, అక్షిత్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 26 వరకు చీకటి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కందుకూరు,ఫిబ్రవరి 20: మండలంలోని పులిమామిడి గ్రామంలోని చీకటి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 22 నుంచి 26వరకు స్వామి వారి బ్రహ్మోత్సవాలకు పూర్తి ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డికి ఆలయ వేదపండితులు రాజశేఖరశర్మ, బీఆర్ఎస్ నాయకులు అనేగౌని అంజయ్యగౌడ్ మంగళవారం ఆమె నివాసంలో కరపత్రాన్ని అందజేశారు. 22న ఉదయం సుప్రభాత సేవతో బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తున్నట్లు రాజశేఖరశర్మ తెలిపారు. రోజూ రాత్రి భజన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 23న మహా గణపతి నవగ్రహ లక్ష్మీసుదర్శన హోమాలు, 24న లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 25న సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, 26న మహాలక్ష్మీ సహస్ర కమలార్చన పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. ఈ బ్రహ్మోత్సవాలకు పులిమామిడి గ్రామస్తులతో పాటు పరిసరాల గ్రామాల భక్తులు పాల్గొని విజయవతం చేయాలని కోరారు.



చీకటి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డికి అందజేస్తున్న వేదపండితులు రాజశేఖర్‌శర్మ, నాయకులు

23న కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

ఆమనగల్లు, ఫిబ్రవరి 20 : కల్వకుర్తి నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఈ నెల 23న కల్వకుర్తి పట్టణంలో నిర్వహిస్తున్నట్లు ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ తెలిపారు. స్థానిక గార్డెన్‌లో ఉదయం 10గంటలకు నిర్వహించే సమావేశానికి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, డిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల పరిధి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని నర్సింహ కోరారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

తలకొండపల్లి, ఫిబ్రవరి 20 : మండల పరిధి వెల్జాల గ్రామానికి చెందిన బాలమణి అనే మహిళ అనారోగ్యంతో మృతిచెందింది. మృతురాలి కుటుంబాన్ని మంగళవారం బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.3వేలు ఆర్థికసాయం అందజేశారు. కుటుంబీకులకు సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో నాయకులు శ్రీకాంత్ యాదవ్, వెంకటయ్య, జగన్, ఆంజనేయులు, దర్శన్, రాములు ఉన్నారు.

ప్రమాద భరితంగా మర్రిచెట్లు

- తొలగించాలని డిమాండ్ చేస్తున్న వాహనదారులు



రోడ్డు పక్కన ఎండిన మర్రి వృక్షాలు

చేవెళ్ల, ఫిబ్రవరి 20: చేవెళ్ల మండలం హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై ఎండిన మర్రి వృక్షాలు ప్రమాద భరితంగా ఉన్నాయి. ఎన్నో సంవత్సరాల క్రితం నాటి మర్రి వృక్షాలు ఎండి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. రోడ్డుపై వెళ్తున్న తరుణంలో ఎప్పుడు ఏ మర్రి చెట్టు కూలుతుందోనని వాహనదారులు భయపడుతున్నారు. గతంలో చాలాసార్లు రోడ్డు పక్క ఉన్న మర్రిచెట్లు రోడ్డుపై పడిపోయి ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. చేవెళ్ల మండల పరిధిలోని బస్తేపూర్ స్టేజీ వద్ద మర్రి చెట్టు ఎండిపోయి రోడ్డుపై కొమ్మలు పడిపోయాయి. ఉన్నతాధికారులు ప్రమాద భరితంగా ఉన్న మర్రిచెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.